# నమస్తే తెలంగాణ

## మంచిర్యాల
## కుమ్రం భీం ఆసిఫాబాద్

5 | ఆదివారం 21 జూలై 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD




కోటపల్లి : ఎదుల్లబంధం వద్ద తుంతుంగ చెరువు మత్తడిలో చేపలు పడుతున్న గ్రామస్తులు

# ముంచెత్తిన ముసురు

- ఎడతెరిపిలేకుండా వర్షాలు
- నదులు, ప్రాజెక్టుల్లోకి భారీగా వరద
- ఉప్పొంగుతున్న వాగులు.. వంకలు
- మత్తళ్లు దుంకుతున్న చెరువులు
- పలు గ్రామాలకు నిలచిన రాకపోకలు
- కూలిన ఇండ్లు.. కోతకు గురైన రోడ్లు
- పలుచోట్ల బడులు బంద్
- పడవ సౌకర్యం కల్పించాలని కలెక్టర్‌కు లేఖ రాసిన దిందా గ్రామస్తులు
- పర్యవేక్షించిన అధికారులు
- కలెక్టరేట్‌లలో కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు



ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్ : వాగును పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, ఎస్పీ డీవీ శ్రీనివాస్ రావు

నమస్తే నెట్‌వర్క్, జూలై 20 : కుమ్రం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో ఎడతెరిపిలేకుండా కురుస్తున్న ముసురు లోతట్టు ప్రాంతాలను ముంచెత్తుతున్నది. నదులు, ప్రాజెక్టులకు వరద వస్తుండగా, వాగులు వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. చెరువులు మత్తళ్లు దుంకుతున్నాయి. పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పంటలు నీట మునిగాయి. ఇండ్లు కూలిపోగా, రోడ్లు కోతకు గురయ్యాయి. ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా సరాసరి 8.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఆసిఫాబాద్ మండలంలోని గుండి వాగు, తుంపెల్లి వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. తుంపెల్లి వాగును కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎస్పీ శ్రీనివాస్‌రావు పరిశీలించారు. అడ ప్రాజెక్టులోకి 1,778 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, అధికారులు 4,5 గేట్లు 0.30 మీటర్ల మేరకు ఎత్తి 1941 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయగా, కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణు, ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్ రావుతో కలిసి పరిశీలించారు. సాయం కోసం 08733-279033, 6304686505లలో సంప్రదించాలని సూచించారు. ఆయన వెంట జిల్లా పౌర సంబంధాల అధికారి సంపత్ కుమార్, కలెక్టరేట్ పరిపాలనాధికారి రఫతుల్లా ఉన్నారు. చింతలమానేపల్లి మండలంలోని దిందా గ్రామం రెండు రోజులుగా జలదిగ్బంధంలో ఉంది. రాకపోకలు నిలిచి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, పాఠశాలలకు ఉపాధ్యాయులు రావడం లేదని, పడవ సౌకర్యం కల్పించాలని దిందా గ్రామస్తులు కలెక్టర్‌కు లేఖ రాశారు. కేతిని, దిందా, శివపెల్లి,నాయికపుగూడ, బాలాజీ అనుకోడ, ఈదుల ఒర్రె, రణవెల్లి వాగు, చింతలపాటి వాగులు ఉప్పొంగి ప్రవహిస్తుండగా, ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పెంచికల్‌పేట్ మండలంలోని పెద్ద వాగు, ఉచ్చమల్లి, బొక్కి వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దహెగాం మండలం అందవెల్లి వద్ద పెద్దవాగు వంతెనపై నిర్మించిన అప్రోచ్ రోడ్డు కోతకు గురికాగా, కాగజ్‌నగర్, భీమిని, దహెగాం మండలాల్లోని 42 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయినాయి. ఐనం గ్రామ సమీపంలో రోడ్యాములపై భారీగా వరద ప్రవహించగా, రెండు గంటల పాటు రాకపోకలు నిలిచి పోయినాయి. వందలాది ఎకరాల్లో పత్తి, వరి, తదితర పంటలు నీట మునిగాయి. కౌటాల మండలం ధనుర్‌హెట్టి వాగు, తాటిపల్లి వద్ద వార్ధా నది, ప్రాణహిత నదులను తహసీల్దార్ పుష్పలత, ఎస్‌ఐ మధుకర్ పరిశీలించారు. కన్నెపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలోని పై కప్పు పెచ్చులు ఊడి పడ్డాయి. మంచిర్యాల జి ల్లాలో 12.2 మిల్లీమీటర్ల వర్షం పడింది. చెన్నూర్‌లోని పెద్ద చెరువు, కుమ్మరికుంట మినీ ట్యాంకు బండ్‌కు వరద చేరుకుంటుంది. మున్సిపాలిటీ కార్యాలయంలో హెల్ప్ డెస్క్(8660291492, 9347302179)ను ఏర్పాటు చేసినట్లు కమిషనర్ గంగాధర్ తెలిపారు. బెల్లంపల్లి డివిజన్‌లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆర్డీవో హరికృష్ణ తెలిపారు. నెన్నెల మండలంలోని ఎర్రవాగు ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో లంబాడీ తండా, ఖర్జీ, కోనంపేట గ్రామాల ప్రజలు ఎటూ వెళ్లలేని పరిస్థితి నెలకొంది. డిప్యూటీ తహసీల్దార్ ప్రకాశ్, ఆర్‌ఐ గణేశ్ వాగును పరిశీలించారు. పద్మన్‌పల్లిలో దొండ రాజమ్మ ఇల్లు శనివారం కూలిపోయింది. కోటపల్లి మండలం నక్కలపల్లికి వెళ్లేదారిలో ఉన్న లోత్రొరైలో లెవల్ వంతెన, రాజారం గ్రామానికి వెళ్లే రోడ్డు కొట్టుకుపోయింది. ఎదుల్లబంధం గ్రామానికి వెళ్లే రోడ్డు తెగిపోగా, తాత్కాలికంగా మరమ్మతులు చేశారు. కొండంపేటలో కుర్మ మల్లయ్య ఇల్లు కూలిపోయింది. నక్కలపల్లి గ్రామానికి చెందిన పోస్టల్ ఉద్యోగి వెముగంటి అనిల్ ద్విచక్ర వాహనం మత్తడి వాగులో కొట్టుకుపోయింది. అనిల్ సురక్షితంగా వరద నుంచి బయటపడ్డాడు. గ్రామస్తులంతా కలసి బైక్‌ను బయటకు తీశారు. వేమనపల్లి మండలంలోని నీల్వాయి ప్రాజెక్టులోకి భారీగా వరద చేరుతున్నది. చామనపల్లి, బమ్మెన వాగు లు ఉధృతంగా ప్రవహిస్తుండగా, రాకపోకలు నిలిచిపోయాయి. ప్రాణహిత నది నిండుగా ప్రవహిస్తున్నది. సమీపంలోని పత్తి పంటలు నీటిలో మునిగిపోయాయి. జన్నారంలోని ఊర చెరువుకు జలకళ వచ్చింది. పొనకల్ ప్రధాన రోడ్డు పక్కన గల స్టేట్‌బ్యాంక్ ఎదుట భారీగా వర్షపు నీరు నిలిచింది. మంచిర్యాల కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్(08736-250501, 08736-250502) ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ కుమార్ దీపక్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో 100కి డయల్ చేయాలని రామగుండం సీపీ శ్రీనివాస్ ఓ ప్రకటనలో సూచించారు.



దహెగాం : కోతకు గురైన పెద్దవాగు వంతెన అప్రోచ్ రోడ్డు



కొండెంగలొద్ది జలపాతం

## కొండెంగ లొద్ది కనువిందు

ఎడతెరిపిలేని వానలకు కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్ పేట్ రేంజ్ పరిధిలోని అగర్‌గూడ-గుండెపల్లి అటవీప్రాంతంలోగల కొండెంగ లొద్ది జలపాతం పరవళ్లు తొక్కుతున్నది. సుమారు 80 మీటర్ల ఎత్తునుంచి పాల నురుగలా జాలువారే నీటిధారలు కనువిందు చేస్తున్నాయి. శనివారం స్థానిక యువకులు అక్కడికి చేరుకొని చూడ ముచ్చటైన అటవీ పరిసరాలను ఆసక్తిగా తిలకిస్తూ కేరింతలు కొట్టారు.

- పెంచికల్ పేట్, జూలై 20

## క్వారీ జాతరకు వేళాయె

- 21న నిర్వహించేందుకు ఏర్పాట్లు
- వేలాదిగా తరలిరానున్న భక్తులు
- పోలీసుల భారీ బందోబస్తు

హాజీపూర్, జూలై 20 : హాజీపూర్ మండలం ర్యాలీగఢ్‌పూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని దుర్గాదేవి (క్వారీ) జాతరను ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆయల కమిటీ ఏర్పాట్లు చేసింది. యేటా ఆషాఢ మాసంలో క్వారీలోని దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది. శనివారం రాత్రి భజన కార్యక్రమాలు నిర్వహించనుండగా, ఆదివారం జరిగే జాతరకు భక్తులు వేలాదిగా తరలిరానున్నారు. ప్రకృతి ఒడిలో కొలువైన దుర్గమ్మ తల్లికి భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకోనున్నారు. అమ్మవారి ఆలయం ఎదుట వాహనాలకు పూజలు నిర్వహించి కోళ్లు, మేకలను బలి ఇచ్చి సహపంక్తి భోజనాలు చేస్తారు. మంచిర్యాల బస్టాండ్ నుంచి జాతర వరకు ఉదయం నుంచచి ఆర్టీసీ బస్సులను నడుపనున్నారు. మంచిర్యాల డీసీపీ భాస్కర్, ఏసీపీ ప్రకాశ్, మంచిర్యాల సీఐ బన్సీలాల్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు.



దుర్గాదేవి ఆలయ ముఖ ద్వారం

# రైతులకు రిక్తహస్తం



లక్షలోపు రుణం తీసుకున్న వారు **35,560** మంది

రుణమాఫీ అయ్యింది **12,477** మందికే..



మంచిర్యాల జిల్లా కేంద్రంలోని డీసీసీబీ బ్యాంక్



మంచిర్యాల జిల్లా కేంద్రంలోని పీఏసీఎస్ సొసైటీ

## డీసీసీబీ, పీఏసీఎస్ సొసైటీల్లో 35 శాతమే రుణమాఫీ

### ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 65 శాతం మాఫీ కాలేదు..

- ఎందుకు కాలేదో స్పష్టంగా చెప్పలేకపోతున్న అధికారులు
- బ్యాంకుల్లో అర్హులు, అనర్హుల జాబితాలకు దిక్కులేదు
- అయోమయం, గందరగోళంగా అన్నదాతల పరిస్థితి

మంచిర్యాల, జూలై 20(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ''బ్యాంకులకు వెళ్లి రూ.2 లక్షల వరకు రుణాలు తెచ్చుకోండి. అధికారంలోకి వస్తే వెంటనే మాఫీ చేస్తాం. రూ.2 లక్షల రుణం తీసుకుని ప్రతి రైతు ఇవాళే పోయి పైసలు తెచ్చుకోండి..'' అంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికలకు ముందు రైతులను రెచ్చగొట్టాడు. రూ.2 లక్షల రుణమాఫీ అంటూ బీరాలు పలికారు. డిసెంబర్‌లో చేస్తామన్న రుణమాఫీ అధికారంలోకి వచ్చి ఆరు నెలలైనా కార్యరూపం దాల్చలేదు. ఎక్కడ చూసినా ఇదే చర్చ నడుస్తున్న తరుణంలో చివరకు విడుతలవారీగా చేస్తామంటూ ప్రకటించారు. రూ.ఒక లక్ష వరకు రుణాలు తీసుకున్న వారికే తొలి విడుత మాఫీ అన్నారు. పోనీలే రూ.లక్ష వరకైనా మాఫీ చేస్తున్నారనుకుంటే దానికి సవాలక్ష కొర్రీలు పెట్టడంతో రాష్ట్రంలోని రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తున్నది. రాష్ట్రంలో రూ. ఒక లక్ష వరకు రుణాలు తీసుకున్న రైతులు లక్షల మంది తొలి విడుతలో రుణమాఫీ కాలేదు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు వచ్చే సరికి రూ.లక్ష రుణాలు తీసుకున్న రైతుల్లో సగం మందికి కూడా రుణమాఫీ కాలేదని గణాంకాలు, క్షేత్రస్థాయిలోని పరిస్థితులు స్పష్టం చేస్తున్నాయి. అసలు రుణమాఫీకి ఏం ప్రాతిపాదికగా తీసుకున్నారు. లక్షలోపు రుణాలు ఉన్న వారికి ఎందుకు మాఫీ చేయలేదు. ఇలాంటి అనేక ప్రశ్నలకు స్పష్టత కొరవడింది. బ్యాంకుల్లోనైతే పంట రుణాలు తీసుకున్న రైతుల జాబితాలే తమ దగ్గర లేవని అధికారులు చెప్తున్నారు. రూ.లక్షలోపు రుణం మీ బ్యాంక్‌లో ఎంత మందికి ఇచ్చారు. వారిలో తొలి విడుతలో ఎంత మందికి మాఫీ అయ్యిందంటే మా దగ్గర ఆ జాబితా లేదంటూ చేతులు ఎత్తేస్తున్నారు. వ్యవసాయశాఖ అధికారులైనా చెప్తున్నారా అంటే అదీ లేదు. ఇటు వ్యవసాయ అధికారులు, అటు లీడ్ బ్యాంక్ అధికారులు మాకేం తెలియదంటే మాకేం తెలియదని తప్పించుకుంటున్నారు. ఉన్నతాధికారుల నుంచి వచ్చిన జాబితాలో ఉన్న వారికి మాత్రమే మాఫీ చేస్తున్నామని చెప్తున్నారు. దీంతో రూ.లక్షలోపు రుణం తీసుకుని, అన్ని రకాల అర్హులుగా ఉన్నప్పటికీ రుణమాఫీ ఎందుకు కాలేదో స్పష్టత లేక రైతులు అయోమయంలో పడిపోతున్నారు.

### సొసైటీల్లో తీసుకున్నోళ్లకు బంద్

గ్రామీణ ప్రాంతాల్లోని రైతులకు రుణాలు ఇవ్వడంలో కీలక భూమిక పోషించే డీసీసీబీ(జిల్లా కేంద్ర సహకార బ్యాంక్), పీఏసీఎస్ సొసైటీల్లో రుణాలు తీసుకున్న చాలా మంది రుణాలు మాఫీ కాలేదు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లానే తీసుకుంటే డీసీసీబీల నుంచి నేరుగా 1,646 మంది, పీఏసీఎస్ సొసైటీల నుంచి 33,914 మంది రైతులు మొత్తం 35,560 మంది రూ.లక్ష వరకు రుణాలు తీసుకున్నారు. వడ్డీతో కలుపుకుని రూ.183.21 కోట్లు రుణం తీసుకున్నారు. కాగా.. తొలి విడుతలో వీరిలో 12,477 మంది రైతులకు సంబంధించిన రూ.63.25 కోట్లు మాత్రమే మాఫీ అయ్యాయి. అంటే రైతులు తీసుకున్న మొత్తం రుణంలో 34.52 శాతం, రైతుల్లో 35 శాతం మందికి మాత్రమే రుణమాఫీ జరిగింది. మిగిలిన 65 శాతం మందికి ఎందుకు రాలేదు అనేదానిపై స్పష్టత లేకుండా పోయింది.

### క్షేత్రస్థాయిలో ఇదీ పరిస్థితి

మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలోని నెల్కి వెంకటాపూర్ సొసైటీలో 418 మంది రైతులు రూ.లక్ష లోపు రుణం తీసుకోగా, వీరిలో 127 మంది రైతులకు రుణమాఫీ అయ్యింది. చెన్నూర్ సొసైటీలో 448 మందికి 80 మందికి, తాండూర్‌లో 190 మందికి 42, లక్షెట్టిపేట మండలం జెండా వెంకటాపూర్ సొసైటీలో 297 మందికి 84, బెల్లంపల్లి మండలం చంద్రవెల్లి సొసైటీలో 749 మందికి 249, కాసిపేట మండలం ధర్మారావుపేట సొసైటీలో 317 మందికి 172, భీమిని సొసైటీలో 396 మందికి 40, జైపూర్ సొసైటీలో 194 మందికి 40, గుళ్లకోట సొసైటీలో 559 మందికి ఏ ఒక్కరికీ రుణమాఫీ కాలేదు. నెన్నెల సొసైటీలో 197 మందికి 13, జన్నారం మండలం పొనకల్ సొసైటీలో 263 మందికి 87, వేమనపల్లి సొసైటీలో 530 మందికి 385 మంది రైతులకే రూ.లక్ష లోపు రుణాలు మాఫీ అయ్యాయి.

- నిర్మల్ జిల్లా భైంసా సొసైటీ పరిధిలో 742 మంది రైతుల్లో 307 మందికే రుణమాఫీ అయ్యింది. దిలావర్‌పూర్ మండలం బన్నపల్లి సొసైటీలో 193 మందికి, మంజులాపూర్ సొసైటీలో 801 మందికి 150, కుంటాల సొసైటీలో 550 మందికి 114, కడెం సొసైటీలో 981 మందికి 489 మందికే లక్ష లోపు ఉన్న రుణాలు మాఫీ అయ్యాయి.
- ఆసిఫాబాద్ జిల్లాలోని కౌటాల సొసైటీలో 600 మందికి 349, తిర్యాణి సొసైటీలో 538 మందికి 462, సిర్పూర్(టీ) సొసైటీలో 824 మందికి 388 మందికే లక్షలోపు రుణాలు మాఫీ అయ్యాయి.
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఏ సొసైటీ తీసుకున్నా లక్షలోపు రుణాలు తీసుకున్న రైతులందరి మాఫీ కాలేదు. ఇతర బ్యాంకుల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. దీనిపై డీసీసీబీలో పని చేసే ఓ ఉన్నతాధికారిని వివరణ కోరగా.. ఇతర బ్యాంకుల్లోనూ రుణం ఉన్న రైతులకు ఇక్కడ మాఫీ కాలేదు అని చెప్పారు. అలాంటి వారు సొసైటీల్లో ఎంత మంది ఉన్నారు. వాళ్లని మినహాయిస్తే అర్హులైన మిగిలిన వారికి ఎందుకు రుణాలు ఇవ్వలేదు అని అడిగితే మాత్రం ఆయన తమకు స్పష్టత లేదంటూ చెప్పుకొచ్చారు. ఈ విషయంలో ప్రభుత్వం క్లారిటీ ఇస్తే తప్పా లక్ష రూపాయల లోపు రుణం తీసుకుని, అన్ని అర్హతలు ఉన్నప్పటికీ రుణం మాఫీ ఎందుకు కాలేదో రైతులకు తెలిసే పరిస్థితి కనిపించడం లేదు.

**జిల్లాలవారీగా డీసీసీబీ, పీఏసీఎస్ సొసైటీల్లో రూ.లక్ష వరకు రుణాలు తీసుకున్న రైతుల వివరాలు**

| జిల్లా | రైతుల అకౌంట్ల సంఖ్య | డీసీసీబీలో తీసుకున్న రుణం | పీఏసీఎస్‌ల్లో తీసుకున్న రుణం | మొత్తం రుణం(కోట్లలో) |
|---|---|---|---|---|
| ఆదిలాబాద్ | 8,909 | 6,11,26,367 | 44,91,62,465 | 51.02 |
| ఆసిఫాబాద్ | 8,125 | 1,17,91,874 | 36,81,99,186 | 37.99 |
| మంచిర్యాల | 4,909 | 43,32,680 | 23,07,80,983 | 23.51 |
| నిర్మల్ | 13,617 | 2,19,303 | 70,65,84,973 | 70.68 |
| మొత్తం | 35,560 | 7,74,70,224 | 175,47,27,607 | 183.21 |

### తెల్వదంటున్నరు



కుమ్రం భీం ఆసిఫాబాద్, జూలై 20 (నమస్తే తెలంగాణ) : మా ఊరిలో ఉన్న వ్యవసాయ భూమి మీద జైనూర్ బ్యాంకులో రూ. 65 వేల రుణం తీసుకున్న. రుణమాఫీ లిస్టులో నా పేరు రాలే. బ్యాంకుకు వెళ్లి అడిగితే సార్లు మాకు తెల్వదంటున్నరు. ఎంతో ఆశపడ్డ. ఇలా అవుతుందనుకోలే. ఇకనైనా సార్లు నాకు న్యాయం చేయాలె.

- కొడప నాగోరావ్, గూడమామడ, జైనూర్



### ఆశపెట్టి ఇవ్వలే..



కుమ్రం భీం ఆసిఫాబాద్, జూలై 20 (నమస్తే తెలంగాణ) : మాకున్న భూమిపై వాంకిడి స్టేట్‌బ్యాంకులో రూ. లక్ష పంట రుణం తీసుకున్న. సర్కారు గురువారం ప్రకటించిన జాబితాలో నాకు రుణమాఫీ కాలేదు. సార్లను అడిగితే తెలుసుకొని చెబుతమంటున్నరు. కాంగ్రెసోళ్లు పంటరుణాలు మాఫీ చేస్తామని చెప్పి ఆశపెట్టి నీళ్లు చల్లిన్రు. ఇప్పటికైనా పంటరుణం మాఫీ అయ్యేలా చూడాలి.

- మర్సుకోల మల్కు, గూడమామ, జైనూర్

# నేడు కడెం నీటి విడుదల



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

లక్షెట్టిపేట, జూలై 20 : ఈ నెల 21న కడెం ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. శనివారం పట్టణంలోని గురునానక్ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రూ. 9.26 కోట్లతో ప్రాజెక్టు గేట్లకు మరమ్మతులు పూర్తయ్యాయని, ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు కడెం ప్రాజెక్టు నీటిమట్టం పెరిగిందన్నారు. అధికారులు గేట్లు ఎత్తి గోదావరిలోకి నీటిని వదలనున్నట్లు తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పింగిళి రమేశ్, జిల్లా ఉపాధ్యక్షుడు చింత అశోక్‌కుమార్, బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు నలిమెల రాజు, అధికార ప్రతినిధి బియ్యాల తిరుపతి, యూత్ అధ్యక్షుడు అంకతి రమేశ్, రాందేని వెంకటేశ్, కో ఆప్షన్ సభ్యులు షాహెద్‌అలీ, నాయకులు నలిమెల సత్తయ్య, చిన్నన్న, రవీందర్, గుండ శ్రీనివాస్, రంజీత్ సింగ్, రాజు, పోచన్న, సురేశ్, తిరుపతి, ఆజీ, నవీన్, రాజమౌళి, నాగ, రాకేశ్ పాల్గొన్నారు.

### సాగు కోసం నీటి విడుదల

హాజీపూర్, జూలై 20 : చివరి ఆయకట్టు రైతులకు సాగునీరందించే లక్ష్యంతో ఆదివారం ఉదయం 10 గంటలకు కడెం ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేస్తున్నట్లు హాజీపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోట రవి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డీసీసీ ఉపాధ్యక్షుడు రాజేశ్వర్ రావు, నాయకులు పుస్కూరి శ్రీనివాస్ రావు, డేగ బాపు, కొట్టె మహేందర్, సత్తయ్య, ఒడ్డె శ్రీనివాస్, బొడ్డు శంకర్ ఉన్నారు.


- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం మరియు
- అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...

నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..

ప్రకటనల విభాగం...

సెల్: 9182 777 571

మంచిర్యాల జిల్లా : 9182 777 676

కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679